



వెళ్లిరా.. వినాయకా

ఒకవైపు డప్పుల శబ్దం.
మరోవైపు జైజై గణేశా,
గణపతి బొప్పా మోరియా..
అంటూ నినాదాలు.
విగ్రహాల ఊరేగింపు ముందు
చిందేస్తున్న యువత.
ఇలా ఆదివారం తిరుపతి
నగరంలో సందడి నెలకొంది.

ఆయా కూడళ్లలో విగ్రహాలు ప్రతిష్ఠించిన ఐదో రోజు వినాయక నిమజ్జనం జరిగింది. ఆయా విగ్రహాలను రూట్‌మ్యాప్ ప్రకారం వినాయక సాగర్‌కు తరలించారు. కొందరు ఇళ్ల వద్ద పూజలు చేసుకున్న ప్రతిమలనూ తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భారీ బందోబస్తు, పటిష్ట ఏర్పాట్లతో ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి











ముగిసిన వేనాడు దర్గా గంధోత్సవం

తడ మండలం వేనాడులోని షేక్ దావూద్ షా వలీల్లాహ్ అల్లాతాత దర్గా గంధోత్సవం ముగిసింది. శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున వర్షం పడుతుండటంతో గంధాన్ని గ్రామంలో ఊరేగించలేదు. దర్గా ప్రాంగణంలోనే ఉంచి ముస్లిం మత పెద్దలచే పూజలు చేశారు. ఆ తర్వాత గంధం, చాదర్‌ను బాబా సమాధి చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి ప్రార్థనల తర్వాత గంధాన్ని సమాధికి లేపనం చేసి పంచి పెట్టారు. గంధోత్సవంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సోదరి రెహనా బేగం, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తదితరులు దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

- తడ, ఆంధ్రజ్యోతి



బాబ సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

డంపింగ్ యార్డుకు రాజకీయ రంగు

- ప్రభుత్వం కేటాయించిన స్థలంపై పక్క గామస్తుల ఆందోళన
- వైసీపీ నాయకుల ప్రమేయంపై ఆరోపణలు



కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమి ఇదే

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కేటాయించిన డంపింగ్ యార్డు స్థలంపై వివాదం చెలరేగుతోంది. ప్రభుత్వం కేటాయించిన భూమికి రాజకీయ రంగు పులుముకుంది. పక్క మండలానికి చెందిన గ్రామస్తులు వచ్చి చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చే ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. వీరి ఆందోళన వెనుక స్థానికంగా కొందరు వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమి సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టు గ్రామ పరిధిలోనిది. అయితే, ఇక్కడ డంపింగ్ యార్డు వద్దంటూ పది కిలోమీటర్లకుపైగా దూరమున్న.. వరదయ్యపాళెం మండలం ఇసకపాలెం గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు సమీపంలోని చెరువు జలాలు కలుషితమవుతాయని చెబుతున్నారు. ఇక ఈ స్థలానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు గ్రామాల ప్రజలు మాత్రం ఆందోళనలో పాల్గొనడం లేదు. ఇసకపాలెం గ్రామస్థుల అభ్యంతరం వెనుక.. కొందరు వైసీపీ నేతల హస్తముందన్న విమర్శలున్నాయి. ఎందుకంటే ఆందోళనకు వచ్చిన వారిలో ఆ పార్టీ సానుభూతిపరులు ఎక్కువగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఇప్పటికీ అదే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి దశాబ్దాల నుంచి డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీంతో కొణ్ణంబట్టు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 131లో 10 ఎకరాలను కేటాయిస్తూ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి సంబంధిత పత్రాలు, స్థలాన్ని అప్పగించారు. దీంతో చెత్త, వ్యర్థాలను తీసుకుని మున్సిపాలిటీ ట్రాక్టర్లు, ఈ-ఆటోలు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలానికి వెళ్లాయి. ఎప్పటికైనా ఆ స్థలాన్ని కబ్జా చేయొచ్చన్న ఉద్దేశ్యంతో ఉన్న ఆ వైసీపీ నేతలు.. డంపింగ్ యార్డుకు స్థలాన్ని ఇవ్వకుండా అడ్డుకునేందుకు.. మరోవైపు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఇసకపాలెం గ్రామస్తులను ఉసిగొల్పినట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వద్దకు వచ్చిన వాహనాలను ఇసకపాలెం గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. నాలుగు రోజుల నుంచీ ఈ వివాదం కొనసాగుతోంది. అధికారులు సర్దిచెబుతున్నా ఆందోళనకారులు వినడం లేదు. ఈ ఆందోళనకు కొణ్ణంబట్టు పంచాయతీ పరిధిలోని గ్రామాలవారు మాత్రం రాలేదు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ జిల్లా అధికారులు డంపింగ్ యార్డు స్థలాన్ని కేటాయిస్తే.. కొందరు సమస్యను మళ్లీ జటిలం చేస్తున్నారు. ఈ సమస్యలను మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు.

మహిళా పార్లమెంటేరియన్ల సమావేశానికి వేదిక ఖరారు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీలల్లో జరగనున్న మహిళా పార్లమెంటేరియన్ల సమావేశానికి తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను వేదికగా ఖరారు చేశారు. దేశవ్యాప్తంగా 300మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యే ఈ సమావేశాన్ని 14న ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు చంద్రగిరిలో లైటింగ్‌షో వీక్షించనున్నారు. 15వ తేది జరిగే ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఆవుతారు. మధ్యాహ్నం తర్వాత మహిళా ప్రతినిధులు, శ్రీకాళహస్తి, షార్, శ్రీసిటీని సందర్శించున్నారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లను మంగళవారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్, ఇతర అధికారులు పరిశీలించనున్నారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



శేషుడిపై గణపతి చిద్విలాసం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు ఆదివారం రాత్రి స్వర్ణ పెద్ద శేష వాహనంపై విహరించారు. వర్షం పడటంతో అర్ధరాత్రి 12గంటల తర్వాత ఊరేగించారు. ఉదయం చిన్న శేష వాహనంపై ఉత్సవర్లు ఊరేగారు. ఈ సందర్భంగా ఉభయదారులు కలశాల ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. సోమవారం ఉదయం వరసిద్ధుడికి చిలుక వాహన సేవ, రాత్రి వృషభ వాహన సేవ నిర్వహించనున్నారు.

చెలరేగుతున్న రౌడీలు

● నెల వ్యవధిలో నాలుగు ఘటనలు ● కొరవడిన పోలీసు నిఘా

రౌడీలకు చోటు లేదు. తోక జాడిస్తే కట్ చేయండి. ఎవరూ మందు కొట్టి రోడ్లపై తిరగడానికి వీల్లేదు. అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపండి. ఆధ్యాత్మిక నగరం.. ప్రశాంతతకు మారుపేరుగా ఉండాలి.

- ఇదీ పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ హర్షవర్ధనరాజు ఇస్తున్న ఆదేశాలు. క్షేత్ర స్థాయిలో చూస్తే మాత్రం ఇవి అమలవుతున్నట్లు కనిపించడంలేదు.

తిరుపతిలో రౌడీలు, పాత కక్షల నేపథ్యంలో మరికొందరు చెలరేగిపోతున్నారు. మద్యం మత్తులో రోడ్లపై గొడవలకు దిగుతున్నారు. ఇలాంటి ఘటనలు నెల వ్యవధిలో నాలుగు చోటుచేసుకోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రతి నెలా తమ పరిధిలోని రౌడీలను స్టేషన్‌కు పిలిపించి గట్టిగా కౌన్సెలింగ్ ఇచ్చి, వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది పోలీసుల ఉదాసీన వైఖరిని అవకాశంగా తీసుకున్న రౌడీలు చెలరేగిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా ప్రధానంగా కొర్లగుంట, సుభాష్‌నగర్, మారుతీనగర్, ఎస్టీవీ నగర్, రైల్వే కాలనీ, మధురానగర్, మసీదు మిట్ట, జీవకోన,తారకరామానగర్, చెన్నారెడ్డి కాలనీ, బొమ్మగుంట, ఇందిరానగర్, పల్లివీధి, గిరిపురం, ఐఎస్‌మహల్, నెహ్రూనగర్, తిరుచానూరు పరిధిలోని దాదాపు ఐదారు ప్రాంతాల్లో కొందరు తిష్టవేసి మద్యం మత్తులో పేట్రేగిపోతున్నారనే విమర్శలున్నాయి. రాత్రి పూట నడి రోడ్లపై మద్యం తాగడం, అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యం చేయడం పరిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల చెన్నారెడ్డి కాలనీ, గిరిపురం ప్రాంతాల్లో ఇద్దరు అకతాయిలు మద్యం తాగి రోడ్లపై హల్‌చల్ చేశారు. ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇక, తాగిన మత్తులో పాతకక్షలతో కత్తులతో దాడులకు తెగబడుతున్నారు. ఇలా శనివారం అర్ధరాత్రి కొర్లగుంట సమీపంలోని సుభాష్‌నగర్‌లో తలెత్తిన ఘర్షణ చివరకు బీ-టెక్ విద్యార్థి చందు హత్యకు దారితీసింది. ఇక్కడున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హేమంత్.. ఆటో డ్రైవర్ అశోక్ మధ్య పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుంచీ వినాయక చవితి మండపానికి దగ్గరలో మద్యం తాగుతూ, చేతిలో కత్తి పెట్టుకుని అశోక్ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో అర్ధరాత్రి తలెత్తిన వివాదంలో చందు మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన అశోక్, హేమంత్‌కు రుయాలో ఆపరేషన్ చేశారు. స్వల్పంగా గాయపడిన సుధాకర్ చికిత్స పొందుతున్నాడని ఈస్ట్ ఎస్‌ఐ హేమాద్రి చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు రెండు వర్గాలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థి చందు మృతికి అశోక్ ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించి.. కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్పీ చర్యలు తీసుకుని ఐడీ పార్టీలు, మొబైల్ పార్టీలు, బ్లూకోల్ట్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులను మరింత అప్రమత్తం చేయాల్సిన అవసరముంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

చందు మృతదేహం అప్పగింత



తిరుపతి (వైద్యం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సుభాష్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటనలో హత్యకు గురైన ఇంజనీరింగ్ విద్యార్థిక చందు మృతదేహానికి ఆదివారం రుయాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా బంధువులు, మిత్రులు భారీగా రుయాకు రావడంతో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. చందు మృతదేహం వద్ద తల్లిదండ్రుల రోదనలు మనస్సును కదలింపజేశాయి. రుయాస్పత్రికి చెందిన మహాప్రస్థానం అంబులెన్సులో మృతదేహాన్ని అతడి స్వగ్రామమైన రాయచోటికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన అశోక్, హేమంత్ పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చిగరపల్లెలో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ చిగరపల్లెలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మండల ఈడిగ (గౌడ) సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని గౌడ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా పోరాటాలలో చురుగ్గా పాల్గొని అనేకసార్లు జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చాక సామాజిక న్యాయం కోసం ఆచార్య ఎన్జీరంగా శిష్యుడిగా రైతు ఉద్యమాలలో కీలకంగా వ్యవహరించారన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభించేలా ఉద్యమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, గౌడ సంఘం నాయకులు శ్రీనివాసులు, గోపి, కుమార్, మోహన్, గురుదేవ్, సోంశేఖర్, దామోదరం, నాగేశ్వరరావ్, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజేంద్రకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రాజేంద్ర

చంద్రగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపురానికి చెందిన కొణిదల రాజేంద్ర డ్యాన్స్, సోషియల్ సర్వీస్‌లో డాక్టరేట్ పొందారు. ఆయన బెంగళూరులో సుమారు లక్ష మందికి డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. అంతేగాక కన్నడంలో 2014లో సామాజిక సేవాతత్వంతో ఆదర్శ రైతు అనే సినిమాకు డైరెక్టర్‌గా పనిచేశారు. ఇందుకు తమిళనాడు రాష్ట్రం ఓసూరులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు.

వేడుకగా నిమజ్జనాలు

చంద్రగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం వినాయక నిమజ్జనం వేడుకగా జరిగింది. ఐదు రోజుల పాటు పూజలు చేసిన గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కల్యాణీడ్యాం, మూలపల్లె చెరువు, చంద్రగిరిలోని నూకలకుంట, నాగలచెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. చెన్నై అంబత్తూరుకు చెందిన శివశక్తి కళా నాట్యాలయానికి చెందిన కళాకారులు కేశికారామ్, జనని, ధనుశ్రీ, లక్షిత, లావణ్య, సాయి సౌందర్య, అనినియా, తియాశ్రీ, జెషికా, యాజిని, శివరంజని పలు భక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులకు శిల్పారామం ఏవో సూర్యతేజ, రాధాకృష్ణ జ్ఞాపికలను అందజేశారు.

రాయలచెరువులో వైభవంగా నిమజ్జనం

● అనుపల్లెలో కోలాహలంగా ఉట్లోత్సవం



రామచంద్రాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయకచవితి వేడుకలు ముగింపు సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఆదివారం బాదూరు చెరువు, రాయలచెరువు, అనుపల్లి చెరువులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. యువత, గ్రామ ప్రజలు గణపయ్య విగ్రహాలను మండపాల నుంచి వాహనాలలో డప్పులు, కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల వద్ద ధూప, దీప నైవేద్యం సమర్పించి నిమజ్జనం చేశారు. అనుపల్లె గ్రామంలో యువత ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఎస్‌ఐ మురళీమోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు



సిద్ధేశ్వరానంద భారతికి పూజలు చేస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీశక్తి పీఠంలో ఆదివారం రాధాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాధా కృష్ణ ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాధాదేవి ధ్యానం, సహస్ర పద్మపుష్పార్చన, బృందావన మృత్తికా పూజలను నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని శక్తిగణపతికి పలు అభిషేక పూజలు నిర్వహించారు. 11,116 మోదకాలతో శ్రీహరిద్రా గణపతి హోమం నిర్వహించగా శక్తి పీఠాదీశ్వరి రమ్యానంద భారతి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. అనంతరం రమ్యానందభారతి సన్యాస స్వీకార దినోత్సవం సందర్భంగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతికి గురుపాద పూజ, మహాపుష్పాభిషేకం నిర్వహించారు. నూతన గ్రంథం సిద్ధుల కథలను ఆవిష్కరించారు. కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



ఎర్రావారిపాలెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి); మండలంలోని 12 పచాయతీల్లో ఆదివారం గణనాథుడి నిమజ్జనం వేడుకగా జరిగింది. ఐదు రోజులుగా పూజలందుకున్న వినాయకుడిని జలాశయాలకు తరలించి, నిమజ్జనం చేశారు. పోలీసుల సూచన మేరకు మండపాల నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందీ లేకుండా నిమజ్జనం చేశారు. చింతగుంట, నాగినేనివారిపల్లె, కమళ్ల, నెరబైలు, బోడేవాండ్లపల్లె, ఉస్తికాయల పెంట, ఎల్లమంద గ్రామాల్లోని పలు పల్లెల్లో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

నడకతో శారీరక, మానసిక వికాసం

తిరుపతి(గాంధీరోడ్డు),ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యమూ నడక, వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధించవచ్చునని గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పీసీ రాయులు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.

నేటి తరానికి సాహిత్య చిత్ర దర్శకులు అవసరం

● శృతిలయల కార్యక్రమంలో వక్తలు



పాటలతో అలరిస్తున్న గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, ధృతి, జయరాం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నేటి తరానికి విశ్వనాథ్, బాపు లాంటి సంగీత, సాహిత్య చిత్ర దర్శకులు అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆదివారం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన శృతిలయలు కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మనసుకు హత్తుకునే విశ్వనాథ్, బాపు చిత్రాలు అజరామరం అన్నారు. నేటి యువతకు సంగీతం పట్ల అవగాహన ఉండాలన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానసిక అశాంతి పెరిగిపోతోందన్నారు. దాన్ని అధిగమించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. సినీ నిర్మాత, నర్సింగ్ కళాశాల అధినేత ప్రవీణ్ మాట్లాడుతూ నవరసాలతో కూడిన సంగీత, సాహిత్య చిత్రాలు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. బిగ్‌బాస్ 7 టాపర్, సీరియల్ నటి ప్రియాంక మాట్లాడుతూ విశ్వనాథ్, బాపు తెలుగు చలన చిత్రరంగంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని, వారి దర్శకత్వంలో నటించలేకపోయాననే ఆవేదన తనలో ఉందని అన్నారు. అనంతరం గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, ధృతి, జయరాం ఆలపించిన పలు గీతాలు ఆహూతులను ఓలలాడించాయి. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి శేషగిరి రావు, కోశాధికారి ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, భాస్కర్, స్వరాజ్యలక్ష్మి, శమంతకమణి పాల్గొన్నారు.

తిరుమలలో భారీగా లడ్డూల వేలం

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని లడ్డూల వేలం భారీ ధర పలికాయి. వినాయకస్వామి ఆలయంలోని లడ్డూను వేలం వేయగా మోహన్ రూ.1.73 లక్షలకు, ఈస్ట్ బాలాజీనగర్‌లో రూ.1.73 లక్షలకు మోహన్(పండు) దక్కించుకున్నారు. 4వ లైన్‌లో రూ.59 వేలకు నీలిమేఘం, మొదటిలైన్‌లో రూ.53 వేలకు ప్రవీణ్, 4 లైన్‌లో రెండవ మండపం వద్ద రూ.35 వేలకు శివ, రెండవ లైన్‌లో రూ.25వేలకు నీలిమ, మొదటిలైన్ రెండవ మండపంలో రూ.22 వేలకు వినయ్ దక్కించుకున్నారు.







వేలంలో పొందిన లడ్డూలతో తిరుమల స్థానికులు

రూ.3.55లక్షలు పలికిన లడ్డు



తిరుపతి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో రూ.3.10లక్షలతో ఇంజనీరింగ్ విభాగం సొంతం చేసుకుంది. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ఐదు రోజుల పాటు వినాయక స్వామికి ఘనంగా పూజలు నిర్వహించామని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్ఈ శ్యాంసుందర్, డీసీ అమరయ్య, ఎంఈలు తులసీకుమార్, గోమతి, ఆర్వోలు సేతు మాధవ్, రవి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

కోదండరామయ్య సేవలు భేష్



తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణికులకు, సంస్థకు కోదండరామయ్య చేసిన సేవలు మరువలేనివని దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం చీఫ్ ఇంజనీరు, సూర్యనారాయణ, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణలు అన్నారు. తిరుపతి, తిరుమలలో కమర్షియల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్ఐ కోదండరామయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో కోదండరామయ్య నిస్వార్థంగా పనిచేశారని కొనియాడారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి,వామనమూర్తి, ప్రభాకర్, మాధవరావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీకాంత్, సీఆర్ఐలు, ఆనంద్, హరిప్రసాద్, విశ్రాంత అధికారులు రఘునాథరెడ్డి, అనంతాచార్యులు, కళాధర్, కుప్పాల గిరిధర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



గిరిబాబు మృతదేహం

తిరుచానూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామినేడు వద్ద ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ అరుణ తెలిపిన వివరాల మేరకు.. దామినేడు హౌసింగ్‌కాలనీకి చెందిన గిరిబాబు(55) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి దామినేడు వద్ద హైవేలో రోడ్డు దాటుతుండగా రేణిగుంట వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, గిరిబాబు మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.



భాకరాపేటలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న ప్రజలు

వేడుకగా వినాయక నిమజ్జనం

భాకరాపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. బళ్లారి డ్రమ్ములు వాయిస్తూ యువత రంగులు చల్లుకుంటూ కేరింతలతో నృత్యాలు చేశారు. వినాయక విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లగా ప్రతి ఇంటి వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



తిరుపతిలోని మిట్టవీధి యూత్ వినాయక విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరగనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఇకఅర్జీదారులు తమ అర్జీలను కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100లో సంప్రదించాలని సూచించారు. ప్రజలు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్ అధికారులకు ఇవ్వాలని తెలిపారు. అక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇవ్వాలని పేర్కొన్నారు.

హోటల్‌లో పనిచేస్తూ.. డీఎస్సీలో టాపర్‌గా నిలిచి

● సోషియల్‌లో జిల్లాస్థాయి 8వ ర్యాంక్ సాధించిన యాగవేంద్ర



కుటుంబ సభ్యులతో యాగవేంద్ర

చంద్రగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తండ్రి వ్యవసాయ కూలీ. కుటుంబ పోషణకూ తానూ తిరుపతిలోని హోటల్ పనిచేస్తున్నారు. కష్టపడి డీఎస్సీకి సిద్ధమై.. ఉమ్మడి జిల్లాలో.. సోషియల్‌లో 8వ ర్యాంక్ సాధించారు యాగవేంద్ర. ఇతడిది చంద్రగిరి మండలం దోర్నకంబాల గ్రామం. నిరుపేద కుటుంబం. తల్లి దండ్రులు మిట్టూరు రుక్మిణమ్మ, రాజగోపాల్‌రెడ్డి కష్టపడి చదివించారు. ఆర్థిక స్థోమతలేక తొలినుంచీ ప్రభుత్వ బడుల్లోనే చదివారు. బీఈడీ చేశారు. ఆ తర్వాత చంద్రగిరికి చెందిన యామినిని వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో కుటుంబ పోషణకోసం తిరుపతిలోని హోటల్లో పనిచేస్తున్నారు. మొదటి సారి టెట్‌లో ఉత్తీర్ణులు కాలేకపోయారు. 2022లో నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించారు. ప్రస్తుత డీఎస్సీ ఫలితాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 6 వేల మందిలో 80.90 (81 మార్కులు)తో సోషియల్‌లో 8వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, తనకున్న ఆర్థిక ఇబ్బందులు, కష్టనష్టాలను అధిగమించి పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్న యాగవేంద్ర.. అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.

శ్రీలంకకు బయలుదేరిన త్రిసేనల ర్యాలీ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నేపాల్ నుంచి త్రిసేనల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటారు సైకిల్ యాత్ర రెండు రోజుల కిందట తిరుపతికి చేరింది. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సభ్యులు.. ఆదివారం తిరుపతి నుంచి నేపాల్‌కు బయలుదేరారు. శిల్పారామం వద్ద జిల్లా పర్యాటకశాఖాధికారి జనార్దన్‌రెడ్డి జెండా ఊపి వీరికి వీడ్కోలు పలికారు. శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ బృందం కన్వీనర్ రాహుల్ పాటిల్ చెప్పారు. సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, ఎడిఫై స్కూల్ అధినేత ప్రణీత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సినిమాల్లో 50 ఏళ్ల ప్రస్థానం



సాయికుమార్, ఆది

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): 'తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ నాకు శ్రీవేంకటేశ్వరస్వామే. ఆయన అనుగ్రహంతో ఈ ఏడాదినా 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తవుతుంది' అని ప్రముఖ సినీనటుడు సాయికుమార్ అన్నారు. తన కుమారుడు, హీరో ఆదితో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 1975 జనవరి 11వ తేదీన తన మొదటి సినిమా 'దేవుడు చేసిన పెళ్లి' విడుదలైందని, అందులో తాను బాలనటుడిగా నటించానని గుర్తుచేసుకున్నారు. 'పోలీస్ స్టోరీ'తో మంచి విజయం వచ్చిందన్నారు. ప్రస్తుతం కన్నడలో రెండు చిత్రాలతో పాటు తమిళంలో 'డీజల్'లో నటిస్తున్నట్టు చెప్పారు. యుగంధర్ దర్శకత్వంలో తాను నటించిన 'శంబాల' చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉందని హీరో ఆది అన్నారు. మంచి టీంతో మంచి సినిమా చేశామన్నారు. అలాగే 'ఎస్‌ఐ యుగంధర్' అనే సినిమా కూడా విడుదలవుతుందన్నారు.

కృష్ణాపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ





పాకాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం మొగరాల పంచాయతీ కృష్ణాపురంలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆదివారం అట్టహాసంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. 'తెలుగువారి ఆత్మగౌరవం' నినాదంతో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ స్థాపించి, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకోసం సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. టీడీపీలో కష్టపడ్డ కార్యకర్తలందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, సర్పంచ్ బి.మధు నాయుడు, స్థానికులు ఆర్.ఆనందచౌదరి, డాక్టర్ నాగరాజనాయుడు, మల్లికార్జున నాయుడు, సుభాష్ నాయుడు, జయచంద్ర, నాగమల్లేశ్వరరావు, రాజేష్, శేషాద్రినాయుడు, సన్ని, టీడీపీ నేతలు కె.సావిత్రి, కె.సుధాకరయ్య, ఎం.వెంకటాద్రిబాబు, ఎస్.చంద్రశేఖర్‌నాయుడు, బాలశంకర్, జనసేన మండల కన్వీనర్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలనంబి అవతార మహోత్సవం



తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1052వ అవతార మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుమల దక్షిణమాడవీధిలోని తిరుమలనంబి ఆలయంలో 16 మంది ప్రముఖ పండితులు ఆయన జీవిత చరిత్రపై ఉపన్యసించారు. భగవద్రామానుజులకు స్వయాన మేనమామ, గురుతుల్యులు, శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒకరైన తిరుమలనంబి శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థకైంకర్యాం ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక ప్రాజెక్టుల అధికారి రాజగోపాల్, ఇతర పండితులు, అర్చకులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నిమ్మగడ్డ రమేష్‌కుమార్

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, తమిళనాడు ప్రభుత్వం డిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్ ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.92 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **77,295**
తలనీలాలు సమర్పించినవారు: **26,779**

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాయలసీమ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో ఆదివారం నిర్వహించిన రాయలసీమ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 52మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహించారు. వయస్సు, బరువు, ఎత్తు ప్రాతిపదికన నిర్వహించిన పోటీలలో 13స్వర్ణ, 10రజిత, 2కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. తైక్వాండో కోచ్‌లు మాస్టర్ ఎ.బాలకృష్ణ, వై.అవినాష్ క్రీడాకారులను అభినందించారు.

డీఎస్‌డీవో, కోచ్‌లకు సన్మానం



డీఎస్‌డీవో, కోచ్‌లను సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించారని, భవిష్యత్తులో కామన్వెల్త్, ఖేలో ఇండియా గేమ్‌లలోనూ అదే స్ఫూర్తి కనబరచాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు జిల్లా క్రీడా విభాగాన్ని కోరారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆయన డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లను ఘనంగా సన్మానించారు. జిల్లాలోని క్రీడా వేదికలలో మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. కోచ్‌లు, ఇతర సిబ్బంది వేతన బకాయిలను విడుదల చేసినట్లు తెలిపారు. సిబ్బంది కొరత ఉంటే భర్తీ చేసుకోవాలని డీఎస్‌డీవోను ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ సూర్యకళ, శశికళ, హరి, ప్రేమ్‌నాథ్, చక్రవర్తి, వినోద్, గోపి, హిందుజ, సాయిసుమతి, ఇజాజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ మునికృష్ణ

తిరుపతి(జీవకోన), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 35వ డివిజన్ భవానీనగర్‌లో వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఆదివారం అన్నదానం చేశారు. ముబ్బురామిరెడ్డి వీధి, ప్రతిభా స్కూల్ శివాలయం వెనుక వైపు వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ సందర్శించి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ప్రెసిడెంట్ ఎంవీఎం శ్రీధర్, యూనిట్ ఇన్‌ఛార్జి లక్ష్మి, సుబ్బుయాదవ్, గంగా, రాజా పాల్గొన్నారు.

కామ్రేడ్ విజయ్‌కు ఘన నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రామచంద్రయ్య

తిరుపతి(జీవకోన), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నేత కామ్రేడ్ విజయ్‌కు ఘన నివాళి అర్పించారు. జీవకోనలోని నాడార్ కల్యాణ మండపంలో ఆదివారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అన్నా రామచంద్రయ్య విజయ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి భాస్కర్, అనంతపురం జిల్లా కన్వీనర్ నాగభూషణం, కమ్యూనిస్టు సానుభూతిపరులు కుమారస్వామిరెడ్డి, ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ హాజరై విజయ్ జీవిత విశేషాలను తెలియజేశారు.

మహేష్ అభిమానుల దాతృత్వం



బాబి బ్రదర్స్‌కు ఆర్థికసాయం అందిస్తున్న కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు దాతృత్వం చాటుకున్నారు. నగర పరిధిలోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన మహేష్‌బాబు అభిమానులు బాబి బ్రదర్స్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మహేష్‌బాబు అభిమానులు ఆయన కుమారుడు గౌతమ్‌కృష్ణ జన్మదినం సందర్భంగా ఆదివారం బాబి బ్రదర్స్‌కు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు.

ముగిసిన వినాయక చవితి వేడుకలు



పద్మానగర్‌లో వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ పద్మా నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఆదివారం ముగి శాయి. పంచాయతీ వార్డు సభ్యులు జె.గౌరమ్మ అధ్వర్యంలో కుటుంబ సభ్యులు, ప్రజలు కలసి ఘనంగా నిర్వహించారు. చివరి రోజు విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. డెక్కన్ కళాశాల సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలూ జరగకుండా గాజులమండ్యం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య





విగ్రహాలకు హారతి ఇస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు- నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ మౌర్య, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి



ఎన్‌జీవో కాలనీలో ఉట్టి కొడుతున్న యువత



ఊరేగింపు కోలాహలం

డ్రోన్లతో నిఘా

● భారీ బందోబస్తుతో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



వినాయక సాగర్ వద్ద ఊరేగింపుగా వస్తున్న భారీ గణనాథుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో నింగి నుంచి నిఘా.. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆదివారం సాయంత్రం తిరుపతిలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని వివిధ కూడళ్లనుంచి విగ్రహాలు ఊరేగింపుగా వచ్చే వీధులు, నిమజ్జనం జరిగే వినాయక సాగర్ వద్ద 550 మంది పోలీసులు, 50 మంది ఎస్టీఎఫ్ బలగాలు, రిజర్వు పోలీసులు, రోప్ పార్టీలను నియమించారు. సాగర్‌లోకి చిన్న పిల్లలు, వృద్ధులను అనుమతించలేదు. రెండు డ్రోన్లు ఆకాశాన తిరుగుతూ నిమజ్జన కార్యక్రమాన్ని ఫొటోలు తీశాయి. దీన్ని అధికారులు గమనిస్తూ.. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులుంటే అక్కడి సిబ్బందికి వెంటనే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారిలను ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. ఆకతాయిలపై నిఘా పెట్టాలని సిబ్బందికి చెప్పారు. వినాయక సాగర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని, బందోబస్తును, నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించి పోలీసులను అప్రమత్తం చేశారు. నిమజ్జనం కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సీసీ కమాండ్ యూనిట్ ద్వారా పరిశీలిస్తూ అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సాగర్ వద్ద గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి నాలుగు ర్యాంపులు, మరో నాలుగు క్రేన్లు ఏర్పాటు చేశారు. దీంతో విగ్రహాలను త్వరగా సాగర్‌లో నిమజ్జనం చేయడంతో వేచి ఉండే సమయం తగ్గిపోయింది. ఇక ఎస్పీ హర్షవర్ధనరాజు సూచనలతో ఉదయం నుంచే విగ్రహాలను తరలించారు. సాగర్ లోపలకు రావడానికి, బయటకు వెళ్లడానికి వేర్వేరు దారులు ఏర్పాటు చేసి.. తోపులాటకు తావులేకుండా క్రమపద్ధతిలో అనుమతించారు. ఇలా అందరి సమన్వయంతో పోలీసు శాఖ చేపట్టిన పటిష్ఠ చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు ఆధ్వర్యంలో డీఎస్పీలు భక్తవత్సలం, ప్రసాద్, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, సీఐలు రాంకిషోర్, శ్రీనివాసులు, మురళీమోహన్, రామయ్య, చిన్నగోవిందు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.



వినాయక సాగర్‌లో విగ్రహాల నిమజ్జనం



స్వాగతం పలికిన కమిటీ సభ్యులు


తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జన కార్యక్రమానికి తరలి వచ్చిన విగ్రహాలకు కరకంబాడి రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాగతం మండపం వద్ద నిమజ్జన కమిటీ సభ్యులు హారతులిచ్చారు. కమిషనర్ మౌర్య ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వాగత మండపం వద్ద ఎస్పీ హర్షవర్ధనరాజు వినాయక విగ్రహాలకు హారతులు పట్టారు. సాగర్ వద్ద అదనపు కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, నరసింహయాదవ్, నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఊకా విజయకుమార్, రుద్రకోటి సదాశివం, గుండాల గోపీనాథ్, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శ్రీనివాస్, చెంగారెడ్డి, ఆనందరెడ్డి, పార్థు, నవీన్ రాయల్, నాగేశ్వరరావు, అనిల్‌రెడ్డి, ఆనంద్, వాసు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ఊరేగింపును ఆసక్తిగా తిలకిస్తున్న నగరవాసులు



బైబై..గణేశా..!



'సుందరకాండ' సక్సెస్ అభిమానులదే



ప్రేక్షకులతో మాట్లాడుతున్న నారా రోహిత్

తిరుపతి అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సుందరకాండ సినిమా విజయవంతమైనందుకు చిత్ర యూనిట్ ప్రేక్షకుల మధ్య సంబరాలు చేసుకుంది. విజయోత్సవ పర్యటనలో భాగంగా హీరో నారా రోహిత్, హీరోయిన్ వృతివగాని, నిర్మాత సంతోష్, శాప్ చైర్మన్ రవినాయుడు, ప్రముఖ విద్యాసంస్థల యజమాని ప్రణీత్ ఆదివారం రాత్రి డీఆర్‌మహల్లో ప్రేక్షకులతో కలిసి సుందరకాండ వీక్షించారు. అనంతరం వేదికపైకి చేరుకుని సినిమాకు గొప్ప విజయం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదరణ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

47వ డివిజన్‌లో అన్నదానం



తిరుపతి(జీవకోన): నగర పరిధిలోని సత్యనారాయణపురం 47వ డివిజన్‌లో టీడీపీ నేత గోళ్ల మధుసూదన్‌నాయుడు ఆధ్వర్యంలో చవితి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నేతలు ముబ్బు దేవనారాయణరెడ్డి, అన్నా రామకృష్ణ, వట్టికుంట చినబాబు, మన్నెం శ్రీనివాసులు పూజలు చేయించారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన): ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుదామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద తిరుపతి నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ప్రజాసేవలో మరింత చురుగ్గా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలే గుర్తింపునిస్తాయి



సీజీఎంలను సన్మానించిన ప్రస్తుత, పూర్వపు సీఎండీలు కె.సంతోషరావు, కలాల రంగనాథం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా నిస్వార్థ సేవలే గుర్తింపునిస్తాయని సదరన్ డిస్కం ప్రస్తుత, పూర్వపు సీఎండీలు కె.సంతోషరావు, కలాల రంగనాథం పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయంలో ఆదివారం చీఫ్ జనరల్ మేనేజర్లు కెఆర్‌ఎస్.ధర్మజ్ఞాని, పి.మురళి. వరకుమార్ ఉద్యోగ విరమణ చేశారు. సన్మాన సభలో సీఎండీలు మాట్లాడుతూ ఏఈ స్థాయి నుంచి నిస్వార్థంగా సేవలు అందిస్తూ సీజీఎం స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం, అధికారులు చేస్తున్న సేవలను వివరించారు. మాజీ సీజీఎంలు లక్ష్మీనరసయ్య, మాసిలామణి, డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, జీఎం ఎం.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీజీఎంలు సంస్థకు చేసిన సేవలను వివరించారు. అనంతరం ఆ ముగ్గురిని తొమ్మిది జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, అభిమానులతో కలిసి సంతోషరావు, కలాల రంగనాథం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రమణాదేవి, జీఎం మురళీకుమార్, ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈ బాలాజీ పాల్గొన్నారు.

భగవంతుడి అనుగ్రహానికి భక్తి ఒక్కటే మార్గం



నారాయణదాసు కీర్తనలపై గోష్ఠిగానం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : భగవంతుడి అనుగ్రహం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి, పంచ సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. మహతి ఆడిటోరియంలో ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ భగవంతుడిని నమ్మి చెడిపోయిన వారు లేరన్నారు. డీపీపీ కళాకారులు నారాయణదాసు కీర్తనలపై గోష్ఠిగానం చేశారు. హరికథ ధర్మప్రచారంపై డాక్టర్ వై.వెంకటేశ్వరులు ఉపన్యసించారు. నారాయణదాసు జీవిత విశేషాల గురించి పి.వరలక్ష్మి వివరించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కథకులు ఎం.రాముడు హరికథా గానం చేశారు. గజేంద్ర మోక్షం అంశంపై వై.వెంకటేశ్వర్లు హరికథా గానం అలరించింది. అంతకు ముందు వెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల అవరణలోని ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ సెక్రటరీ రాంగోపాల్, ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, ఏఈవో సీహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి సమాజానికి మహాప్రస్థానం గీతాలు సజీవ సాక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సాకం నాగరాజు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నేటి సమాజానికి మహాప్రస్థానం గీతాలు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకం రాసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంధ్రప్రదేశ్ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజు మాట్లాడుతూ నేటి సమాజ స్థితిగతుల గురించి శ్రీశ్రీ ఆనాడే అక్షర రూపం ఇచ్చారని తెలిపారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో శ్రీశ్రీ గీతాలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య మాట్లాడుతూ నవసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించిన అభ్యుదయ కవి శ్రీశ్రీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు, వేమన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు మల్లారపు నాగార్జున, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, బాలసుబ్రమణ్యం, నారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, మునిరత్నం, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా రాధాష్టమి వేడుకలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఆదివారం రాధాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. నంది సర్కిల్ సమీపంలోని రాధాశ్యామ్ సుందర్ మందిరంలో రాధాశ్రీకృష్ణుల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేసి, సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇస్కాన్‌లోనూ రాధాష్టమి వేడుకలు నిర్వహించారు.

రేపు సెలూన్ కిట్ల పంపిణీ

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం మహిళలకు చీరలు, నాయీ బ్రాహ్మణులకు సెలూన్‌కిట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతులమీదుగా అందజేయనున్నట్లు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ నగరంలోని ఏజీకే బిల్డింగ్‌లో ఉదయం 10.30గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

యువకుడి హత్యకేసులో ఇద్దరి అరెస్టు

బైక్, రెండు ఫోన్ల స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన అటుపాక శివయ్య(25) హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన శివయ్య, అదే గ్రామానికి చెందిన మూలింటి ముని జానకీ రాం, పోలూరు సాయికుమార్ స్నేహితులు. వారి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. మంగళవారం ముని జానకీరాం ఫోన్ చేసి శివయ్యను ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రమ్మని పిలిచాడు. అప్పటికే అక్కడున్న ముని జానకీరాం, సాయికుమార్, శివయ్యతో కలిసి క్రాస్‌రోడ్డులో మద్యం బాటిళ్లు కొనుగోలు చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ తోటలోకి వెళ్లి మద్యం తాగారు. శివయ్య మద్యం మత్తులో ఉండగా సాయికుమార్ పాత కక్షలను గుర్తు చేశాడు. తన తండ్రి, అక్క మరణానికి శివయ్య కుటుంబీకులే కారణం నిందించాడు. కర్ర, ఇనుపరాడ్డుతో శివయ్యను బలంగా కొట్టాడు. శివయ్య పారిపోవడానికి ప్రయత్నించగా సాయికుమార్ బీరు బాటిళ్లతో గొంతు వద్ద పొడిచి చంపేశాడు. బుధవారం ఉదయం జామాయిల్ చెట్ల మధ్య శివయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం స్థానిక ఈఎస్ఎస్ కళాశాల వద్ద నిందితులు ముని జానకీరాం, సాయికుమార్‌ను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఒక బైక్, రెండు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు జైలుకు తరలించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది రాజేంద్ర, చక్రి, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఏఎంసీలో ఓజిలినుంచి ముగ్గురికి చోటు





కూచివాడ పవిత్రారెడ్డి, కొండూరు సౌమ్య, కాటూరు కోటేశ్వరరావు

ఓజిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో ఓజిలి మండలం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. మండలంలోని మానమాలకు చెందిన కూచివాడ పవిత్రారెడ్డి, గుర్రంకొండకు చెందిన కొండూరు సౌమ్య, ఓజిలికి చెందిన కాటూరు కోటేశ్వరరావును ఏఎంసీ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఆదివారం నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బెటాలియన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఫిట్ ఇండియా... ఫిట్ ఆంధ్రప్రదేశ్... సండేస్ ఆన్ సైకిల్ విత్ స్టేట్ పోలీస్ ఫోర్సెస్' కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన జాతీయ క్రీడోత్సవాలు

కోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలు ముగిశాయి. ఇంజనీరింగ్ విద్యార్థుల సైకిల్ ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రాంగణం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీ మల్లికార్జున రెడ్డి, శోభారాణి, రాముకుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెం వాసికి డాక్టరేట్



కోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం గ్రామానికి చెందిన సుకుమార్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాదులోని ఐఐసీటీలో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుకుమార్ ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో సుకుమార్ 'న్యూసింటటిక్ మేత లాడజీస్ ఫర్ బెంజిమీజూజా, ఇసోక్వినోలిన్ అండ్ అజా ఫ్లవానోన్స్ అండ్ కంఫోర్ బేస్డ్ ఎనినో ఆసిడ్ ఆన్ న్యూటర్న్ హిందూ సింగ్ టేంప్లేట్ అనే పీహెచ్‌డీ పూర్తిచేశాడు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆటో చోరీకి గురైంది. పెళ్లకూరు మండలం అర్లపాడు గ్రామానికి చెందిన గంగయ్య తన కుమార్తెకు పురిటి నొప్పులు రావడంతో శనివారం రాత్రి ఆటోలో నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించాక వెళ్లి చూసేసరికి ఆటో కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భువనేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు

తడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటైంది. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడుగా తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా గుమ్మిడిపూడి ఏడుమలై, చిలమత్తూరు పరంధామయ్య ఆచారితో పాటు మరో నలుగురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు దేవస్థానం ఖాతా ద్వారానే విరాళం ఇవ్వాలని కోరారు.

రజక సంఘ కమిటీ ఎంపిక

ఓజిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల ఇనుగుంటలో ఆదివారం రజక సంఘం నూతన కమిటీని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా ఇందిరమ్మ, అధ్యక్షురాలిగా పాలేటి మంజులమ్మ, ఉపాధ్యక్షుడుగా డి.శ్రీనివాసులు, సహకార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా తూపిలి శ్యామలమ్మను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రజక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కళత్తూరు రమణయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి అక్కరపాక సుబ్బయ్య పాల్గొన్నారు.




నాయుడుపేట - రేణిగుంట 6లేన్ జాతీయ రహదారి - నాయుడుపేట సమీపంలో లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేదెలా?

6 లేన్ రహదారిలోనూ యాక్సిడెంట్లు ● సూచిక బోర్డులు లేక, అతివేగంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలో ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల, తిరుపతికి ఈ రహదారి నుంచి వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ పదుల సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 6లేన్ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు 58 కిలోమీటర్ల 6లేన్ జాతీయ రహదారిని రూ.2,238 కోట్ల వ్యయంతో నిర్మించారు. అయినా రోడ్డు ప్రమాదాలు ఆగడంలేదు. ఇటీవల నాయుడుపేట పట్టణానికి చెందిన ఓ కుటుంబం దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తూ మరో వాహనానికి ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా నాయుడుపేట సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. నాయుడుపేట - పెళ్లకూరు రహదారి సమీపంలో రోడ్డు దాటుతుండగా మోటారు సైకిలిస్టులు, పాదాచారులు రోడ్డు ప్రమాదాలకు గురై అనేక మంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. నాయుడుపేట - విన్నమాల సమీపంలో తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్థంభాన్ని ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై అవసరమైన ప్రాంతాల్లో సూచిక బోర్డులు లేకపోవడం, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గురువులను గౌరవించడం అందరి బాధ్యత



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువులను గౌరవించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. నిత్యం పనిఒత్తిడితో ఉండే ఉపాధ్యాయులకు ఆట విడుపుగా ఉండేలా క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు ఉత్తమ బోధనను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థను పటిష్టపరిచేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, అరికట్ల మస్తాన్ నాయుడు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, కరిముల్లా, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడు పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ సంఘమేశ్వరావు, ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరులోని చాగణం లలితమ్మ - భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్‌ను సోమవారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం డీఎస్పీ చెంచుబాబు, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరావు, ఎస్ఐ నాగరాజుతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ట్రస్ట్‌లో లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాల పంపిణీ, డీ-అడిక్షన్ సెంటర్, వ్యాయామశాల, పార్కు ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పాల్గొంటారని ట్రస్ట్ సీఈవో పెనుబల్లి సీతారామయ్య తెలిపారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినాయణ రెడ్డి తదదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద జనసేన నాయకులు ఆవుల రమణ, మాభాషా ఆధ్వర్యంలో నోవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, టీడీపీ నాయకుడు మాధవనాయుడు చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు హరిబాబు, కోటి, రాము, సురేష్, తేజ, సూర్య, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఏకగ్రీవం

నాయుడుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల సీఐటీయూ నూతన కమిటీని ఆ సంఘ జిల్లా కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంఘం మహేష్, ప్రధాన కార్యదర్శిగా శివకవి ముకుంద, సహకార్యదర్శిగా ఎన్.శ్యామల, ఉపాధ్యక్షులుగా సుజాత, కాలేషా, కోశాధికారిగా విజయమ్మ, సభ్యులుగా మస్తాన్‌రెడ్డి, సతీష్, పెంచులమ్మ, నాదముని, వానమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాయుడుపేట సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు.

ట్రాక్టర్ బోల్తా: పది మందికి గాయాలు

వాకాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామస్తులు వినాయక విగ్రహాన్ని తూపిలిపాళెం సముద్రతీరానికి తీసుకువెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో పది మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కాశీపురం నుంచి 25 మంది గణేష్ విగ్రహంతో నిమజ్జనానికి బయలుదేరారు. వాకాడు గిరిజన కాలనీ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





తడ మండల పరిధిలోని వేనాడులో వెలసిన షేక్ దావూద్ షా వలీల్లాహ్ అల్లాతాత దర్గా గంధోత్సవం ఆదివారం ముగిసింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సోదరి రెహనా బేగం, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు బొమ్మన్ పళణి, శెల్వం, బొమ్మన్ శ్రీధర్ దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ అన్నపూర్ణ, గ్రామస్తులు శ్రీరాం, సదానందం,వెంకటాద్రి, భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అప్పుతీసుకున్న నగదు అడిగినందుకు కత్తితో దాడిచేసిన ఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పట్టణానికి చెందిన నరసయ్య, అతని స్నేహితుడు సురేంద్రరెడ్డి ఆదివారం రాత్రి మద్యం తాగారు. ఆ సమయంలో నరసయ్య తనకు ఇవ్వాల్సిన రూ.160 నగదు గురించి సురేంద్రరెడ్డిని అడిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సురేంద్రరెడ్డి కత్తితో నరసయ్యపై దాడి చేశాడు. గాయపడిన నరసయ్యను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేటి తరానికి సాహిత్య చిత్ర దర్శకులు అవసరం



పాటలతో అలరిస్తున్న గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, ధృతి, జయరాం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి విశ్వనాథ్, బాపు లాంటి సంగీత, సాహిత్య చిత్ర దర్శకులు అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆదివారం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన శృతిలయలు కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మనసుకు హత్తుకునే విశ్వనాథ్, బాపు చిత్రాలు అజరామరం అన్నారు. నేటి యువతకు సంగీతం పట్ల అవగాహన ఉండాలన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానసిక అశాంతి పెరిగిపోతోందన్నారు. దాన్ని అధిగమించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. సినీ నిర్మాత, నర్సింగ్ కళాశాల అధినేత ప్రవీణ్ మాట్లాడుతూ నవరసాలతో కూడిన సంగీత, సాహిత్య చిత్రాలు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. బిగ్‌బాస్ 7 టాపర్, సీరియల్ నటి ప్రియాంక మాట్లాడుతూ విశ్వనాథ్, బాపు తెలుగు చలన చిత్రరంగంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని, వారి దర్శకత్వంలో నటించలేకపోయాననే ఆవేదన తనలో ఉందని అన్నారు. అనంతరం గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, ధృతి, జయరాం ఆలపించిన పలు గీతాలు ఆహూతులను ఓలలాడించాయి. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, భాస్కర్, స్వరాజ్యలక్ష్మి, శమంతకమణి పాల్గొన్నారు.




గూడూరు, సూళ్లూరుపేటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

నిమజ్జనానికి గణనాథులు

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో వినాయక చవితి సందర్భంగా కొలువుదీర్చిన గణనాథులను ఆదివారం ఐదోరోజు నిమజ్జనానికి తరలించారు. గాండ్లవీధి, గణపతి నగర్, ఆఫ్గన్ వీధి, ఝాన్సీనగర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీర్చిన గణనాథుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం అనంతరం నిమజ్జనా నికి తరలించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తడ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జనం వేడుకగా జరిగింది. వినాయక చవితి నాడు ప్రతిష్ఠించిన విగ్రహాలకు ఐదు రోజులపాటు పూజలు చేశారు. ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్‌కు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

నాయుడుపేట టౌన్: వినాయక చవితి నాడు ప్రతిష్ఠించిన విగ్రహా లను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. నాయుడుపేట పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దాదాపు గరిష్ఠంగా అన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

గూడూరు: పట్టణంలోని పలు కూడళ్లలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తర లించారు. ముందుగా వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. వాహనాలపై ఉంచి గ్రామోత్సవాలు జరిపారు. బాణసంచా పేలుళ్లు, తీన్‌మార్ బ్యాండు మేళాలు, యువత చిందుల నడుమ గ్రామోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని పంబలేరు, వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీర ప్రాంతాల్లో నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాలను తీసుకెళ్లారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని మన్నూరు, జయంపు రజక వీధి, గొట్టికాడు గ్రామాల్లో వినాయకులను ఆదివారం నిమజ్జనం చేశారు.



బాలాయపల్లి మండలం జయంపులో వినాయకుడి ఊరేగింపు

అలరించిన నృత్య ప్రదర్శనలు

తిరుచానూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. చెన్నై అంబత్తూరుకు చెందిన శివశక్తి కళా నాట్యాలయానికి చెందిన కళాకారులు కేశికారామ్, జనని, ధనుశ్రీ, లక్షిత, లావణ్య, సాయి సౌందర్య, అననియా, తియాశ్రీ, జెషికా, యాజిని, శివరంజని పలు భక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులకు శిల్పారామం ఏవో సూర్యతేజ, రాధాకృష్ణ జ్ఞాపికలను అందజేశారు.

తిరుమలలో భారీగా లడ్డూల వేలం

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని లడ్డూల వేలం భారీ ధర పలికాయి. వినాయకస్వామి ఆలయంలోని లడ్డూను వేలం వేయగా మోహన్ రూ.1.73 లక్షలకు, ఈస్ట్ బాలాజీనగర్‌లో రూ.1.73 లక్షలకు మోహన్(పండు) దక్కించు కున్నారు. 4వ లైన్‌లో రూ.59 వేలకు నీలిమేఘం, మొదటిలైన్‌లో రూ.53 వేలకు ప్రవీణ్, 4 లైన్‌లో రెండవ మండపం వద్ద రూ.35 వేలకు శివ, రెండవ లైన్‌లో రూ.25వేలకు నీలిమ, మొదటిలైన్ రెండవ మండపంలో రూ.22 వేలకు వినయ్ దక్కించుకున్నారు.

డీఎస్‌డీవో, కోచ్‌లకు సన్మానం



డీఎస్‌డీవో, కోచ్‌లను సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించారని, భవిషత్తులో కామన్వెల్త్, ఖేలో ఇండియా గేమ్‌లలోనూ అదే స్ఫూర్తి కనబరచాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు జిల్లా క్రీడా విభాగాన్ని కోరారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆయన డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లను ఘనంగా సన్మానించారు. జిల్లాలోని క్రీడా వేదికలలో మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. కోచ్‌లు, ఇతర సిబ్బంది వేతన బకాయిలను విడుదల చేసినట్లు తెలిపారు. సిబ్బంది కొరత ఉంటే భర్తీ చేసుకోవాలని డీఎస్‌డీవోను ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ సూర్యకళ, శశికళ, హరి, ప్రేమ్‌నాథ్, చక్రవర్తి, వినోద్, గోపి, హిందుజ, సాయిసుమతి, ఇజాజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కృష్ణమోహన్

శ్రీకాళహస్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు, ప్రజలు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ అన్నారు. పట్టణంలోని గ్రేడ్-1 గ్రంథాలయాన్ని ఆదివారం చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్వీఆర్ ఎస్ఎస్ శర్మతో కలిసి తనిఖీ చేశారు. గ్రంథా లయంలో అందుతున్న సేవలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. 'చదవడం మాకు ఇష్టం' క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు, కాంపిటీటివ్ పరీక్షల్లో విజయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో అనేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులు, యువతలో నైపుణ్యం పెరిగి వారి ఎదుగుదలకు ఎంతో దోహదం పడుతుందన్నారు. పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో
సత్యవేడు బాలికకు గోల్డ్ మెడల్


సర్టిఫికెట్లతో చిన్నారులు

సత్యవేడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్యవేడుకు చెందిన లక్షిత బంగారు పతకాన్ని సాధించింది. హరియాణాలోని కురుక్షేత్ర యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్యవేడు పట్టణంలోని మాస్టర్ స్కూల్ విద్యార్థిని జి.లక్షిత (2వ తరగతి) గోల్డ్‌మెడల్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలకు రాష్ట్ర ంనుంచి 60 మంది పాల్గొనగా లక్షిత అండర్ 8-9 ఇయర్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా పట్టంలోని దళవాయి అగ్రహారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్. ప్రియ (2వ తరగతి) అదే విభాగంలో బ్రౌన్ మెడల్ సాధించింది. లక్షిత, ప్రియ హరియాణా రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి గురు గౌతమ్ క్షేత్ర చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా గణేశ నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న మంచినీళ్ల గుంట వద్ద, మండపం వద్ద ఉన్న ప్రతిష్ఠించిన ప్రతిమలు

పుత్తూరు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చవితి వేడుకల్లో భాగంగా 5వ రోజు వినాయక నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. మండపాల్లో మధ్యాహ్నం అన్న దానం చేశారు. అలాగే లడ్డూ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. సాయంత్రం వినాయక మండపాల వద్ద యువత ఉట్టి కొట్టి సం బరాలు చేసుకున్నారు. అనంతరం రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ జై గణేశ్ మహారాజ్‌కి జై అంటూ ప్రతిమలను ఊరే గించిన అనంతరం నిమజ్జనం చేశారు. పట్ట ణంలోని మండపం, ఎస్టీఐ కాలనీ, రామా నాయుడు కాలనీ, మంచి నీళ్లగుంటల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని ప్రతిమలను నిమజ్జనం చేశారు.

రూ.లక్ష పలికిన వినాయక లడ్డు



వడమాలపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్బీఆర్ పురంలో వినాయక మండపంలో ఏర్పాటు చేసిన ప్రతిమ వద్ద ఉంచిన లడ్డూను వేలం వేయగా రూ.లక్ష పలికింది. గ్రామానికి చెందిన గాదిరాజు రవి కుమార్‌రాజు రూ.1,11,116కు వేలంలో దాన్ని దక్కించుకున్నారు. అనంతరం ప్రతిమను కోలాహలంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

గౌడ కులస్థుల అభివృద్ధికి కృషి



పుత్తూరు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలుగు మహిళ నాగరత్న పేర్కొన్నారు. ఆదివారం పాకాల మండలం, చిగరపల్లిలో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పుత్తూరుకు చెందిన నగరి నియోజకవర్గ తెలుగుమహిళ నాగరత్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోదుడుగా గౌతు లచ్చన్న చేసిన సేవల గురించి గుర్తు చేసుకున్నారు. గౌడ కులస్థుల సంక్షేమానకి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యాంసుందర్, కృష్ణమూర్తి, తుమ్మల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ జూపార్క్‌కు నెమలి అప్పగింత



వడమాలపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండ లంలో పలు గ్రామాల్లో తిరుగాడుతున్న నెమలిని అటవీశాఖ అధికారులు పట్టుకుని ఎస్వీ జూపార్క్‌కు అప్పగించారు. 'గ్రామాల్లోకి నెమళ్లు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో దినపత్రికలో ఈనెల 27న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అటవీశాఖ అధికారులు శనివారం తిరుమణ్యంలో మామిడి తోటలో ఉన్న నెమలిని పట్టుకుని తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శన శాల అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట సెక్షన్ రేంజ్ అధికారి శంకరప్ప, బీట్ అధికారి మునినాయక్, గొల్లపల్లి బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



పుత్తూరు అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్మార్ట్ పాలన కొనసాగిస్తోందని పుత్తూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ డీఎస్ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం గేట్ పుత్తూరులో స్మార్ట్ రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన ఏఐ టెక్నాలజీతో పోటీపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఎస్.ఎస్.ధనపాల్, అన్బళగన్, తెలుగుమహిళ మోహన, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై దాడి

వడమాలపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నారాయణదాసుతోటలో ఇంట్లో ఉన్న యువతి కుమారిపై శశికిరణ్ దాడిచేసి గాయపరచినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చప్పారు. శుక్రవారం రాత్రి కుమారి ఇంట్లో ఉండగా తిరుపతి కొర్లగుంట, సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన శశికిరణ్ గొడవపడి బీర్ బాటిల్‌తో పొత్తి కడుపు భాగంలో పొడచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం






శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, రేణిగుంటల్లో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణపయ్య నిమజ్జనం వేడుక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. చవితి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా వినాయక ప్రతిమలను ఏర్పాటు స్థానికులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఐదో రోజు ఆదివారం సెలవు రావడంతో పెద్దఎత్తున నిమజ్జన మహోత్సవం జరిగింది. ఉదయం నుంచి వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఉట్టి కొడుతూ పిల్లలు, పెద్దలు కేరింతలు కొడుతూ సంబరంగా జరపుకున్నారు. ఇక మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం వినాయక నిమజ్జన మహో త్సవం సందర్భంగా ఊరేగింపులు ఆరంభమయ్యాయి. వాయిద్యాల మధ్య పిల్లలు, పెద్దలు కోలాహలంగా చిందులు వేస్తూ బైబై గణేశ అంటూ రాత్రి వరకు వాడవాడలా ఉన్న వినాయక ప్రతిమలు వాహనాల్లో సాగాయి. శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు మండలాల్లో నిమజ్జన వేడుక కన్నులపండువగా సాగింది. ఆయా గ్రామాల్లో కమిటీలు ప్రతిమలను నిమజ్జనం చేశారు.

● చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణవ్యాప్తంగా పలు వినాయక ప్రతిమలను ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ యువ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ పలు వినాయక మండపాల వద్ద జరిగిన అన్నదానాల్లో పాల్గొని భక్తులకు వడ్డించారు. సాయి, వినయ్‌కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక నిమజ్జనాలు కోలాహ లంగా జరిగాయి. ఐదు రోజుల పాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్య ప్రతిమలను ఆదివారం సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మండపాల ముందు యువకులు ఉట్టి కొట్టారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో యువకులు ఉట్టి ఉత్సవం నిర్వహించారు. కొత్త గొల్లకండ్రిగ వినాయక మండపం వద్ద జనసేన నాయకుడు ప్రేమ్ బాబు అన్నదానం చేశారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక ప్రతి మలను ఐదో రోజు కోలాహలంగా నిమజ్జనాలకు తరలించారు. మండలంలో చవితిని పురస్కరించుకొని 160 వినాయక ప్రతిమలను ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశాయి. మూడో రోజు 45 ప్రతిమలను నిమజ్జనం చేయగా ఐదో రోజు 115 ప్రతిమలను దామినేడు చెరువులో, పన్నీరు కాలువలో నిమజ్జనం చేశారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం వినాయక ప్రతిమల నిమజ్జన మహోత్సం ఘనంగా నిర్వహించారు. కేవీబీపురం, సదాశివపురం, రాయపేడు, దిగువపుత్తూరుల్లో వినాయక ప్రతిమలను మేళతాళాల నడుమ ఊరేగించి ఆయా గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం గణేశ నిమజ్జనం ఘనంగా జరిగింది. పట్టణంలోని వినాయక ప్రతిమలను స్థానిక తెలుగు గంగ కాలువ వద్ద నిమజ్జనం చేయగా, గ్రామాల్లో ప్రతిష్ఠించిన ప్రతిమలను సమీపంలోని చెరువులు, బావుల్లో నిమజ్జనం చేశారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక గణేశ నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. గోవర్ధనపురం, కృష్ణాపురం, రామాపురం, అనిల్ సెంటర్, మొక్కలచేను, గాంధీనగర్, సంతోష్‌పురం, ఎన్టీఆర్ నగర్, బాలకృష్ణాపురం తదితర గ్రామాలనుంచి వాహనాల్లో వచ్చిన ప్రతిమలను కడూరు వద్ద కరుణా నదిలో నిమజ్జనం చేశారు. ఏకం ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సునీల్‌జీ, లక్ష్మీజీ, గ్రామస్తులు వల్లివేటి శ్రీకాంత్ చౌదరి, రమణ చౌదరి, హరిప్రసాద్, గుత్తి త్యాగరాజు, రమేష్‌రెడ్డి, దిలీప్ రాయల్‌తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అన్నదానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్

రాజులకండ్రిగలో లడ్డూకు రూ.68వేలు
● రూపాయి బిళ్లకు రూ.46వేలు

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగలో చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి లడ్డూను వేలం వేశారు. లడ్డూను రూ.68వేలకు పర్వాతాల మునిరాజు, గీత దంపతులు దక్కించుకున్నారు. తరువాత వినాయకుడి రూపాయి బిళ్లను దివ్య, కరుణాకర్ దంపతులు రూ.46వేలకు దక్కించుకున్నారు. సర్పంచ్ చెంగల్రాజు, మురళీరాజు, వెంకటాచలం, జనార్ధన రాజు, మల్లికార్జున్ రాజు, మునిభాస్కర్, వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నంది వాహనంపై అగస్త్యేశ్వరుడి వైభవం



నారాయణవనం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదవల్లి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అధికార నందిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆదివారం ఉదయం నిత్యపూజా కైంకర్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టు పవిత్రాల సమర్పణ నిర్వహించి, మరగదవల్లి సమేత అగస్త్యేశ్వరుడిని నంది వాహనంపై కొలువు దీర్చి ప్రత్యేక పూజల అనంతరం ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సాయిబాబా సత్సంగ వార్షికోత్సవం



నారాయణవనం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళంలో ఉన్న సాయిబాబా సత్సంగ కేంద్రం పంచమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం బాబాకు దీపారాధన, నిత్యప్రార్థన, పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం వితరణ జరిగింది. సాయంత్రం సాయిబాబా, గురూజీ చిత్రపటాల గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

డంపింగ్ యార్డుగా మారుతున్న కాళంగి కాలువ



ఆయుర్వేద ఆస్పత్రి, ఎడమ కాలువలో పడేసిన వ్యర్థాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారి సమీపంలో ఉన్న కాళంగి కుడి కాలువ వ్యర్థాలు, చెత్తతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. కాళంగి రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా మండలంలో 16 చెరువులకు నీరు చేరేది. తెలుగుగంగ ఉప కాలువలు ఏర్పాటు చేయడంతో కాళంగి కుడికాలువ నిరుపయోగంగా మారింది. ఈ కాలువ నీర్పాకోట చెరువు, మండల కేంద్రంలోని దుకాణాలు దగ్గర నుంచి గాజులపెళ్లూరుకు చెరువుకు చేరుతుంది. ప్రస్తుతం కాలువలో నీరు పారకపోవడంతో బీఎన్‌కండ్రిగ పట్టణంలోని దుకాణదారులు చెత్తను, చికెన్, మటన్ వ్యర్థాలను కాలువలో పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసనతో ప్రజలు తిరగలేకపోతున్నారు. కాలువకు రెండు వైపులా ఆయుర్వేద అస్పత్రి, ఒక ప్రైవేటు ఆస్పత్రి ఉన్నాయి. పంచాయతీ పారిశుధ్య అధికారులు స్పందించి కాలువలో వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. అలాగే చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వాహనంతో పాటు డీజే స్పీకర్ల సీజ్

రేణిగుంట ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అతిక్రమించి చవితి ఊరేగింపులో డీజే స్పీకర్లను ఉపయోగించడంతో పోలీసులు వాహనంతో పాటు స్పీకర్లను సీజ్ చేశారు.సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... పాంచాలి నగర్‌కు చెందిన నిమజ్జన కమిటీ సభ్యులు రాత్రి వినాయకుడు ప్రతిమ ఊరేగించే సమయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనంలో డీజే స్పీకర్లను ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనంతో పాటు స్పీకర్ బాక్స్ ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే స్థానిక వడ్డిమిట్టలో ఊరేగింపు సమయంలో ఓ మహిళపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో వేణుగోపాలపురానికి చెందిన స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషనుకు చేరుకొని ఫిర్యాదు చేశారు. దాడి చేసిన అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

భగ్గుమన్న పాతకక్షలు: కొణతనేరిలో ఇరువర్గాల దాడులు





శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పాతకక్షలు భగ్గుమన్నాయి. ఇరు వర్గాలు దాడి చేసుకున్నారు. ఈ ఘటనతో తొట్టంబేడు మండలం కొణతనేరిలో యుద్ధవాతావరణాన్ని తలపించింది. తొట్టంబేడు మండలం దిగువ కొణతనేరి దళితవాడకు చెందిన కిరణ్‌కుమార్, మణి మధ్య పాత కక్షలున్నాయి. ఆదివారం గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలను నిర్వహించారు. ముగిసిన తరువాత ఇళ్ల వద్ద వారి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. దాంతో ఇరువర్గాల వారు కర్రలతో ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ గొడవలో ఒక వర్గానికి చెందిన కిరణ్‌కుమార్(35), వెంకట కృష్ణ(58), మరో వర్గానికి చెందిన నక్కా మణి(35), మణి(38), గీత (30) గాయపడ్డారు. ఇరువర్గాల వారు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఐదుగురికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి సమాజానికి మహాప్రస్థానం గీతాలు సజీవ సాక్ష్యం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నేటి సమాజానికి మహాప్రస్థానం గీతాలు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకం రాసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజు మాట్లాడుతూ నేటి సమాజ స్థితిగతుల గురించి శ్రీశ్రీ ఆనాడే అక్షర రూపం ఇచ్చారని తెలిపారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో శ్రీశ్రీ గీతాలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య, పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు, వేమన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు మల్లారపు నాగార్జున, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, బాలసుబ్రమణ్యం, నారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, మునిరత్నం, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

భగవంతుడి అనుగ్రహానికి భక్తి ఒక్కటే మార్గం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : భగవంతుడి అనుగ్రహం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి, పంచ సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. మహతి ఆడిటోరియంలో ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ భగవంతుడిని నమ్మి చెడిపోయిన వారు లేరన్నారు. డీపీపీ కళాకారులు నారాయణదాసు కీర్తనలపై గోష్ఠిగానం చేశారు. హరికథ ధర్మప్రచారంపై డాక్టర్ వై.వెంకటేశ్వరులు ఉపన్యసించారు. నారాయణదాసు జీవిత విశేషాల గురించి పి.వరలక్ష్మి వివరించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కథకులు ఎం.రాముడు హరికథా గానం చేశారు. గజేంద్ర మోక్షం అంశంపై వై.వెంకటేశ్వర్లు హరికథా గానం అలరించింది. శ్రీరామ్ రఘునాథ్, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.